క్లుప్తంగా

రేగాలమ్మకు మొక్కుల చెల్లింపు



అమ్మవారికి మొక్కులు చెల్లిస్తున్న భక్తులు

గరుగుబిల్లి: మండలంలోని నాగూరులో రేగాలమ్మ గ్రామదేవతకు గ్రామస్తులు మొక్కులు చెల్లించుకున్నారు. గ్రామంలోని అమ్మవారి గుడి ప్రాంగణంలో బుధవారం వివిధ రకాల పుష్పాలు, నైవేద్యం, చీరలతో అత్యంత వైభవంగా అమ్మవారికి పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. ఏటా ఖరీఫ్ ప్రారంభానికి ముందు ఎలాంటి కష్టాలు రాకుండా ఉండాలని, పంటలు సమృద్ధిగా పండాలని అమ్మవారికి మొక్కులు చెల్లించుకోవడం ఆనవాయితీగా వస్తోందని గ్రామస్తులు తెలిపారు.

బదిలీపై వెళ్లిన సర్వేయర్లకు సన్మానం



సర్వేయర్లను సన్మానిస్తున్న తహసీల్దార్, రెవెన్యూ సిబ్బంది

పాలకొండ: మండలంలోని గ్రామ సచివాలయాల పరిధిలో పనిచేసి బదిలీపై వెళ్లిన సర్వేయర్లను బుధవారం సన్మానించారు. కొండాపురం గ్రామ సర్వేయర్ ఎల్.వెంకటరమణ, సింగన్నవలస గ్రామ సర్వేయర్ ఎస్.సాగర్, అంపిలి గ్రామ సర్వేయర్ ఎస్.వెంకటేష్‌లను తహసీలాకదర్ పి.సోమేశ్వరరావు, మండల సర్వేయర్ పి.వెంకటరావు, ఉప తహసీల్దార్ బుచ్చయ్య ఆధ్వర్యంలో ఈ సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఆర్ఐ పుష్ప, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

ఎమ్మెల్యే పరామర్శ

గుమ్మలక్ష్మీపురం: మండల కేంద్రంలోని కొండ వీధికి చెందిన సీఆర్పీ కిల్లక రవికుమార్ ఇటీవల మృతి చెందడంతో అతని కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి బుధవారం పరామర్శించారు. రవికుమార్ మృతికి గల కారణాలను అడిగి తెలుసుకుని ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఆ కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఇంటి నిర్మాణానికి రూ.25 వేలు అందజేయనున్నట్లు ప్రకటించారు. ఎమ్మెల్యే వెంట ఎంపీపీ కుంబురుక దీనమయ్య, రజక కార్పొరేషన్ డైరెక్టర్ గోరిశెట్టి గిరిబాబు, సర్పంచ్ గౌరీశంకరరావు, వ్యవసాయ సలహా మండలి చైర్మన్ అడ్డాకుల చిన్నారావు తదితరులున్నారు.

భోగి లత దంపతులకు సత్కారం



భోగి లత దంపతులను సత్కరిస్తున్న గృహ నిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్

వీరఘట్టం: వీరఘట్టంకు చెందిన నాయకురాలు, స్టేట్ హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ భోగి లత, ఆమె భర్త మాణిక్య చంద్రశేఖరరావులను గృహనిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్ బుధవారం విజయవాడలో సత్కరించారు. 45వ గృహనిర్మాణ దినోత్సవం సందర్భంగా వారిని సత్కరించినట్లు ఆమె తెలిపారు. అలాగే కార్పొరేషన్ చైర్మన్ డి.దొరబాబు, టిడ్కో చైర్మన్ జమ్మాన ప్రసన్నకుమార్ తమను అభినందించినట్లు వారు తెలిపారు.

సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన అవసరం



మాట్లాడుతున్న ఎంఈఓలు సూరిదేముడు, వెంకటరమణ

సీతానగరం: ప్రభుత్వం అమలు చేస్తున్న అమ్మ ఒడి పథకం ద్వారా విద్యార్థుల తల్లుల ఖాతాల్లో డబ్బులు జమయ్యేలా ఉపాధ్యాయులు చర్యలు చేపట్టాలని ఎంఈఓలు జి.సూరి దేముడు, ఎం.వెంకటరమణ కోరారు. మండల విద్యావనరుల కేంద్రంలో మండలంలోని అన్ని ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల హెచ్ఎంలతో బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యాపరమైన అంశాలపై, విద్యేతర అంశాలపై అవగాహన కల్పించుకోవాలన్నారు. జిల్లా స్థాయిల్లో అన్ని పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు త్వరలో శిక్షణా తరగతులు నిర్వహించనున్నట్లు తెలిపారు. విద్యార్థులకు సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపొందించడానికి ఉపాధ్యాయులు అవగాహన కల్పించుకోవాలని అన్నారు. అలాగే అన్ని యాజమాన్యాల కింద పని చేస్తున్న ఉపాధ్యాయులు అమ్మ ఒడి పథకం అమలయ్యేలా ఇప్పటి నుండే జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, సీఆర్పీలు, విద్యాశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

మెలకువలు పాటిస్తే.. సాగు బాగు

- ఖరీఫ్ వరిసాగుకు అన్నదాతలు సన్నద్ధం
- సరైన యాజమాన్య పద్ధతులు పాటిస్తే అధిక దిగుబడులు



సిద్ధం చేసిన వరినారు మడి



వరినాట్లు వేస్తున్న రైతులు (ఫైల్)

గరుగుబిల్లి: ఖరీఫ్ సీజన్ ప్రారంభమైంది. వరి సాగుపై రైతులు దృష్టి సారించారు. పంట సాగులో మెలకువలు పాటిస్తే ఆశించిన దిగుబడులు పొందవచ్చని మండల వ్యవసాయాధికారి ఆర్.విజయ భారతి సూచించారు. సమగ్ర పోషక యాజమాన్య పద్ధతులు పాటిస్తే సత్ఫలితాలు పొందవచ్చునని పేర్కొన్నారు. ఆరోగ్యకరమైన వరి సాగుకు రైతులు చేపట్టాల్సిన మెలకువలను వివరించారు.

నారు పెంచడమిలా..

- నారుమడిని 10–12 రోజుల వ్యవధిలో 3 దఫాలుగా చదును చేయాలి.
- 5 సెంట్ల నారుమడికి 2 కిలోల నత్రజని (విత్తనాలు చల్లడానికి ముందు 1 కిలో, చల్లిన తరువాత 12 రోజులకు 1 కిలో), 1 కిలో భాస్వరం, 1 కిలో పొటాష్‌నిచ్చే ఎరువులు దుక్కిలో వేయాలి.
- మొలక కట్టిన విత్తనాన్ని సెంటుకు 5 కిలోల చొప్పున చల్లుకోవాలి.
- నారు, ఒక ఆకు పూర్తిగా పురివిచ్చుకునే వరకు ఆరు తడులు ఇచ్చి తరువాత పలుచగా నీరు నిలకట్టాలి.
- నాట్లు వేయడానికి 15 రోజుల ముందే పొలాన్ని దమ్ము చేయడం ప్రారంభించి 2–3 దఫాలుగా మురగ దమ్ము చేయాలి. పొలమంతా సమానంగా దమ్ము చెక్కతో చదును చేయాలి.

నాట్లువేసే పద్ధతి

నారు తీసేటప్పుడు మొక్కలు లేత ఆకుపచ్చగా ఉంటేనే మొనకుదుళ్లు పొలంలో నిలబడతాయి. నాలుగు నుంచి ఆరు ఆకులున్న వరినారును నాట్లకు ఉపయోగించాలి. ముదురు ఆకును నాటితే దిగుబడి తగ్గుతుంది. వరినారు మొనను పైపైన నాటితే పిలకలు ఎక్కువగా తొడిగే అవకాశముంది. నాట్లు వేసేటప్పుడు భూసారాన్ని అనుసరించి ఈ సీజన్‌లో చ.మీ.కు 33 మొనలు ఉండేలా చూసుకోవాలి. నాటిన తరువాత ప్రతి రెండు మీటర్లకు 20 సెంటీమీటర్లు బాటలు తీయడంవల్ల పైరుకు గాలి, వెలుతురు బాగా సోకి చీడపీడల ఉధృతి కొంతవరకు అదుపు చేయవచ్చు. ఎరువులు, పురుగు మందులు, కలుపు మందులు వేయడానికి, పైరు పరిస్థితిని గమనించడానికి ఈ బాటలు బాగా ఉపయోగపడుతాయి. వరి రకాల కాల పరిమితిని బట్టి కుదుళ్ల సంఖ్యను నిర్ధారించుకోవాలి. భూసారం ఎక్కువ ఉన్న పొలాల్లో తక్కువ కుదుళ్లు, భూసారం తక్కువ ఉన్న పొలాల్లో ఎక్కువ కుదుళ్లు ఉండేటట్లు నాట్లు వేయాలి. ముదురు నారు నాటినప్పుడు నత్రజని ఎరువును సిఫార్సు కంటే 25 శాతం అధికంగా వాడాలి.

యాజమాన్య పద్ధతులు

- భూసార పరిరక్షణకు ఉత్పత్తిని పెంచడానికి రసాయనిక ఎరువులతోపాటు సేంద్రియ ఎరువులు వాడి పైరుకు సమతుల్యంగా పోషకాలను అందించాలి.
- పశువుల ఎరువు, కంపోస్టు, కోళ్ల ఎరువు వంటి సేంద్రియ, రసాయనిక ఎరువులతో కలిపి వాడినట్లయితే 20–25 శాతం వరకు నత్రజనిని ఆదా చేయవచ్చు.
- పంట పొలాలలో అపరాలు, జీలుగ, జనుము, పిల్లి పెసరలాంటి పచ్చిరొట్ట పైరును పెంచి కలియ దున్నటం ద్వారా భూసారం పెరగడంతో పాటు నత్రజని, భాస్వరం, పొటాష్‌లు 20–25 శాతం వరకు ఆదా చేయవచ్చు.

పేదల సంక్షేమమే ధ్యేయం



దుడ్డుఖల్లులో గిరిజన మహిళకు ప్రభుత్వం ద్వారా అందిన లబ్ధిని వివరిస్తున్న ఎమ్మెల్యే పుష్పశ్రీవాణి

- ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి

గుమ్మలక్ష్మీపురం: పేదల సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి అన్నారు. మండలంలోని దుడ్డుఖల్లు గ్రామ సచివాలయం పరిధిలోని కంబగూడ, దుడ్డుఖల్లు, కొత్తవలస, లోవలక్ష్మీపురం గ్రామాల్లో బుధవారం 'గడపగడపకు మన ప్రభుత్వం' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె వలంటీర్లు, సచివాలయ ఉద్యోగులు, అధికారులతో కలిసి ఇంటింటికీ వెళ్లి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి నేటి వరకు అందించిన సంక్షేమ పథకాల లబ్ధిని వివరించారు. అలాగే వారి సమస్యలను అడిగి తెలుసుకుని వాటి పరిష్కారానికి కృషి చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఆమె వెంట ఎంపీపీ కుంబురుక దీనమయ్య, జెడ్పీటీసీ మండంగి రాధిక, వైస్ ఎంపీపీ నిమ్మక లక్ష్మణరావు, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

నేడు మరికొన్ని గ్రామాల్లో..

దుడ్డుఖల్లు సచివాలయం పరిధిలోని విశ్వనాథపురం, దాదుపురం, బెల్లిడి, దొరజమ్ము, బుడ్డెమ్మఖర్జ గ్రామాల్లో గురువారం 'గడపగడపకు మన ప్రభుత్వం' కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఎంపీపీ కుంబురుక దీనమయ్య తెలిపారు. ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి ఆధ్వర్యంలో నిర్వహించే ఈ కార్యక్రమానికి పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున హాజరుకావాలని కోరారు.

నేడు తలవరంలో 'జగనన్న సురక్ష'

వీరఘట్టం: మండలంలోని తలవరం, హుస్సేనుపురం గ్రామాల్లో గురువారం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించనున్నట్లు తహసీల్దార్ చందక సత్యనారాయణ, ఎంపీడీఓ జయంత్ ప్రసాద్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ రెండు సచివాలయాల పరిధిలో వచ్చే అన్ని సమస్యలను పరిష్కరించేందుకు సిబ్బంది సిద్ధంగా ఉండాలని సూచించారు.

వీరఘట్టంలో అమ్మఒడి సంబరాలు

వీరఘట్టం: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల గ్రౌండ్‌లో గురువారం అమ్మఒడి సంబరాలు నిర్వహించనున్నట్లు ఎంఈఓలు డి.గౌరునాయుడు, ఆర్.ఆనందరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ హాజరుకానున్నట్లు వెల్లడించారు. బాలుర, బాలికోన్నత పాఠశాలల విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఈ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

కరుణించిన వరుణుడు

పాలకొండ, భామిని: గత కొద్ది రోజులుగా భానుడి భగభగలతో పాటు ఉక్కపోతతో ఇబ్బందులు పడిన ప్రజలకు బుధవారం కురిసిన వర్షంతో కాస్త ఉపశమనం లభించింది. నీటి తడి లేక ఎండిపోతున్న వరినారుకు ప్రాణం వచ్చినట్లయింది. విస్తారంగా వర్షాలు కురుస్తుండడంతో అన్నదాతల ఆశలు చిగురించాయి. పొలాల్లో నీరు చేరడంతో ఖరీఫ్ దమ్ములకు రైతులు సన్నద్ధమవుతున్నారు.

చేతి రాత చక్కగా ఉండాలి



పలగరలో విద్యార్థులతో మాట్లాడుతున్న ఎంఈఓ సింహాచలం

బలిజిపేట: పాఠశాల విద్యార్థుల చేతిరాత చక్కగా ఉండే విధంగా ఉపాధ్యాయులు కృషి చేయాలని ఎంఈఓ సింహాచలం తెలిపారు. పలగర, గుడివాడ కాలనీలలో ప్రాథమిక పాఠశాలలను ఆయన బుధవారం ఆకస్మికంగా సందర్శించారు. విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించారు. విద్యార్థుల చేత రాయించి వారి చేతిరాతను గమనించి వారికి మెలకువలు తెలిపారు. ఉపాధ్యాయులు విద్యార్థుల చేతిరాత చక్కగా ఉండే విధంగా చూడాలని సూచించారు. ఆంగ్ల పాఠాన్ని చదివించారు. వెనుకబడిన విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ ద్వారా వారిని ముందుకు తీసుకురావాలని తెలిపారు. విద్యార్థులకు చదవడం, రాయడం బాగా నేర్పించడం వలన ముందు తరగతులలో వారికి ఇబ్బందులు ఎదురుకాకుండా ఉంటాయని తెలిపారు. కార్యక్రమంలో సీఆర్పీ శ్రీరామ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

త్వరితగతిన పనులు పూర్తిచేయాలి

- ఐటీడీఏ పీఓ కల్పనాకుమారి



మాట్లాడుతున్న పీఓ కల్పనాకుమారి

సీతంపేట: హౌసింగ్ లేఅవుట్‌లకు విద్యుత్, మంచినీటి సౌకర్యం కల్పించాలని ఐటీడీఏ పీఓ కల్పనాకుమారి ఆదేశించారు. ఐటీడీఏలో పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యూఎస్, ఏపీఈపీడీసీఎల్ అధికారులతో బుధవారం సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గడపగడపకు కార్యక్రమం కింద మంజూరైన పనులను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. గ్రామాల్లో క్లోరినేషన్ ప్రక్రియ పక్కాగా చేపట్టాలన్నారు. ఇంటింటికి కుళాయి పనులు, గ్రామ సచివాలయ భవనాలు, రైతుభరోసా కేంద్రాలు, హెల్త్ క్లినిక్ భవనాల నిర్మాణం వేగవంతం చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఏపీఓ రోసిరెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ ప్రభాకరరావు, టీఎస్ ప్రసాదరావు, పీఆర్ ఎస్ఈ వీఎస్ఎన్ మూర్తి, పీఆర్‌ఈఈలు సురేష్‌కుమార్, గిరిధర్, రాధారాణి తదితరులు పాల్గొన్నారు.

తపాలా పొదుపు పథకాలపై అవగాహన



పోస్టల్ స్కీంలపై అవగాహన కల్పిస్తున్న అసిస్టెంట్ సూపరింటెండెంట్ జి.వి.రమణరావు

గుమ్మలక్ష్మీపురం: తపాలా జీవిత బీమా, పొదుపు పథకాలను గ్రామీణులు సద్వినియోగించుకోవాలని తపాలా శాఖ పార్వతీపురం సబ్‌డివిజన్ అసిస్టెంట్ సూపరింటెండెంట్ జి.వి.రమణరావు అన్నారు. మండలంలోని చెముడుగూడ గ్రామంలో బుధవారం నిర్వహించిన వన్ జన్‌ధన్(గిరిజన ప్రాంత ఆర్థిక చేరిక) క్యాంపెయిన్‌లో పాల్గొని పొదుపు పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. 2023 ఆగస్టు 9వ తేదీ వరకు చిన్న మొత్తాల పొదుపు పథకాల సేకరణ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. పోస్టల్ సేవింగ్ స్కీం, ఆర్‌డీ, సుకన్య సమృద్ధి యోజన, నెలవారి ఆదాయ పథకం, సీనియర్ సిటిజన్ సేవింగ్స్ స్కీం, పబ్లిక్ ప్రావిడెంట్ ఫండ్, టైమ్ డిపాజిట్, మహిళా సమ్మాన్ సేవింగ్స్ సర్టిఫికెట్ వంటి పథకాలతో పాటు పోస్టల్ లైఫ్ ఇన్సూరెన్స్ పథకాల వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. ఆయా పథకాలను గ్రామీణ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఆయన వెంట బీపీఎం రవికుమార్ ఉన్నారు.

వ్యవసాయానికి 'ఉపాధి'ని అనుసంధానించాలి



సమావేశంలో మాట్లాడుతున్న అప్పలనాయుడు

భామిని: జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకాన్ని వ్యవసాయ రంగానికి అనుసంధానం చేయాలని ఏపీ రైతు సంఘం జిల్లా గౌరవ అధ్యక్షుడు గురుబిల్లి అప్పలనాయుడు డిమాండ్ చేశారు. మండలంలోని పెద్దదిమిలిలో బుధవారం జీపుజాతాను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ ప్రభుత్వం మాదిరిగా ఆంధ్రాలో కూడా రైతులకు ఎకరానికి రూ.10 వేలు సాగు సాయం అందించాలని కోరారు. అలాగే రూ.2 లక్షల వరకు పంట రుణాలను ఒకేసారి మాఫీ చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం రైతు సమస్యలపై రైతులతో చర్చించారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి బి.అప్పలనాయుడు, మండల అధ్యక్షుడు జి.లక్ష్మీపతినాయుడు తదితరులు పాల్గొన్నారు.

విలీనంతో ప్రాథమిక విద్యకు తూట్లు

- యూటీఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్ దండు ప్రకాశరావు



ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న ప్రకాశరావు

భామిని: జాతీయ విద్యా విధానం పేరున పాఠశాలల విలీనంతో ప్రాథమిక పాఠశాలలు నిర్వీర్యం అయ్యే పరిస్థితులు దాపురించాయని యూటీఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్ దండు ప్రకాశరావు అన్నారు. మండలంలోని నేరడి–బి, గురండి, బత్తిలి, పెద్దదిమిలి, బాలేరు ప్రభుత్వ పాఠశాలలను బుధవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విలీనంతో అనేక పాఠశాలలు ఏకోపాధ్యాయ పాఠశాలలుగా మారాయని, విద్యా సంస్కరణలతో టీచర్ పోస్టులు ఘణనీయంగా తగ్గిపోయాయని అన్నారు. గిరిజన ఆశ్రమ పాఠశాలలో రెగ్యులర్ టీచర్లను నియమించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఉపాధ్యాయులకు రావాల్సిన డీఏలు, పీఆర్సీ ఎరియర్స్ చెల్లించాలని డిమాండ్ చేశారు. ఉపాధ్యాయుల సమస్యలపై పాఠశాలల వారీగా చర్చించారు.

బీటీరోడ్డు నిర్మాణానికి భూమిపూజ



పల్లపుసిరిపిలో బీటీరోడ్ నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే పుష్పశ్రీవాణి

జియ్యమ్మవలస: మండలంలోని పీటీమండ పంచాయతీ పల్లపుసిరిపి గ్రామానికి రూ.57 లక్షలతో, నడిమిసిరిపి గ్రామానికి రూ.64లక్షలతో బీటీ రోడ్డు నిర్మాణానికి ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి బుధవారం భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ..గిరిజన గ్రామాల అభివృద్ధే ధ్యేయంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పనిచేస్తున్నారని, గిరిజనులంతా ఆయనకు రుణపడి ఉంటామని అన్నారు. మరోసారి సీఎంగా జగన్‌మోహన్‌రెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించుకుందామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ మూడడ్ల గౌరీశంకరరావు, జెడ్పీటీసీ శశికళ, డీసీసీబీ డైరెక్టర్ లోలుగు నారాయణరావు, నాయకులు బలగ వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

విద్యారంగంలో విప్లవాత్మక మార్పులు



మాట్లాడుతున్న సర్పంచ్ మహేశ్వరరావు

గరుగుబిల్లి: విద్యారంగంలో విప్లవాత్మకమైన మార్పులను ప్రభుత్వం తీసుకొచ్చిందని రావుపల్లి పంచాయతీ సర్పంచ్ బొంతాడ మహేశ్వరరావు అన్నారు. మండలంలోని రావుపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో మండల స్థాయిలో నాలుగో విడత అమ్మఒడి కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. విద్యకు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పెద్దపీట వేస్తున్నారన్నారు. జగనన్న గోరుముద్ద, జగనన్న విద్యాకానుక, విద్యాదీవెన, వసతిదీవెన, అమ్మఒడి వంటి కార్యక్రమాలను అమలుచేసి పేదవిద్యార్థులకు ప్రభుత్వం అండగా నిలుస్తోందన్నారు. ఎంఈఓ ఎస్.నాగభూషణరావు మాట్లాడుతూ ఒకటి నుంచి 12వ తరగతి వరకు చదివే విద్యార్థుల తల్లుల ఖాతాలో ఏటా రూ.15వేలు జమచేస్తోందన్నారు. నాలుగో విడతగా మండలంలో సుమారు 5వేల మంది తల్లుల ఖాతాల్లో నగదును జమ చేయడం జరిగిందన్నారు. రూ.15 వేలులో రూ.1,000లు టాయిలెట్ మెయింటెనెన్స్‌కు, రూ.1,000లు స్కూల్ మెయింటెనెన్స్ ఫండ్‌కు జమచేసి మిగిలిన రూ.13వేలు తల్లుల ఖాతాలో జమ చేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ ఎల్.గోపాలరావు, విద్యార్థులు, తల్లులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వలంటీర్‌కు చేయూత



వలంటీర్‌కు ఆర్థిక సాయం అందజేస్తున్న సర్పంచ్ గౌరీశంకరరావు

గుమ్మలక్ష్మీపురం: గుమ్మలక్ష్మీపురం గ్రామ సచివాలయం పరిధి కొండవీధిలో వలంటీర్‌గా విధులు నిర్వహిస్తున్న రజని భర్త రవికుమార్ ఇటీవల మృతి చెందడంతో తోటి వలంటీర్లతో పాటు సచివాలయ ఉద్యోగులు ఆమెకు అండగా నిలిచారు. తమవంతుగా చందాలు పోగుచేసి రూ.9 వేలు సేకరించారు. ఈ మొత్తాన్ని సర్పంచ్ బొత్తాడ గౌరీశంకరరావు చేతులమీదుగా బుధవారం బాధితురాలికి అందజేశారు. కార్యక్రమంలో వీఆర్వో బి.కృష్ణ, పంచాయతీ కార్యదర్శి కిశోర్, గ్రామ పెద్దలు ఉన్నారు.

ఆస్పత్రికి వెళ్లి పింఛన్ అందజేత



యర్రయ్యకు పింఛన్ అందిస్తున్న సంధ్యారాణి

పాలకొండ: మండలంలోని సింగన్నవలస గ్రామానికి చెందిన వన్నలి యర్రయ్య ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడి విశాఖపట్నం కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్నాడు. పింఛన్ లబ్ధిదారుడు కావడంతో వలంటీర్ జి.సంధ్యారాణి బుధవారం ఆస్పత్రికి వెళ్లి ఈ నెల పింఛన్ మొత్తాన్ని అందజేసింది. అంత దూరం వెళ్లి పింఛన్ అందించిన సంధ్యారాణిని గ్రామస్తులు అభినందించారు.

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన



రైతులకు అవగాహన కల్పిస్తున్న ప్రకృతి వ్యవసాయ సిబ్బంది

సీతంపేట: మండలంలోని పెదరామ గ్రామంలో మహిళా సంఘాల సభ్యులకు ప్రకృతి వ్యవసాయంపై బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు డీపీఎం ధనుంజయరావు మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయ విధానంలో పంటలు సాగు చేయడం ద్వారా తక్కువ పెట్టుబడితో అధిక, ఆరోగ్యకరమైన పంట దిగుబడులు సాధించవచ్చన్నారు. అనంతరం కషాయాల తయారీని వివరించారు. కార్యక్రమంలో ఏఓ మన్మథరావు, ఎస్ఎఫ్ఏ తిరుపతి, కృష్ణవెంకట్ తదితరులు పాల్గొన్నారు.

ఇసుకగెడ్డలో గ్రామసభ



మాట్లాడుతున్న ఎంపీడీఓ సత్యం

సీతంపేట: మండలంలోని దారబ సచివాలయం పరిధిలో ఇసుకగెడ్డ గ్రామంలో బుధవారం సంసద్ ఆదర్శ గ్రామ యోజన గ్రామసభ నిర్వహించారు. ఇప్పటివరకు పంచాయతీ పరిధిలో చేపట్టిన పనులు, భవిష్యత్‌లో చేపట్టాల్సిన పనుల ప్రణాళికపై ఎంపీడీఓ కె.సత్యం, ఇతర శాఖల అధికారులు చర్చించారు. రహదారులు, తాగునీటి సమస్యలు, మౌలిక వసతుల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ సిమ్మయ్య, ఎంపీటీసీ నిమ్మక హరిప్రసాద్, ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ ప్రభాకరరావు, ఏపీఓ సాగర్, ఫీల్డ్ అసిస్టెంట్ మన్మథరావు పాల్గొన్నారు.

క్రీడా మైదానం అభివృద్ధికి ఆర్థిక సాయం



ఆర్థిక సాయం అందిస్తున్న ఎమ్మెల్యే పుష్పశ్రీవాణి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పరీక్షిత్‌రాజు

గుమ్మలక్ష్మీపురం: మండలంలోని గొయిపాక గ్రామంలో క్రీడా మైదానం అభివృద్ధికి రూ. 50వేలు ఆర్థికసాయం అందించిన ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి, వైఎస్సార్‌సీపీ పార్వతీపురం మన్యం జిల్లా అధ్యక్షుడు శత్రుచర్ల పరీక్షిత్‌రాజుకు గ్రామస్తులు కృతజ్ఞతలు తెలియజేశారు. వైఎస్సార్‌సీపీ మండల ఎస్సీ సెల్ కన్వీనర్, స్థానిక నాయకుడు సామల మాధవరావు, ప్రసాంత్, జయరాజు, ఫిలిఫ్, సర్పంచ్ కారంగి లక్ష్మి, తదితరులు బుధవారం మాట్లాడుతూ.. గ్రామ సమీపంలోని ఖాళీ స్థలాన్ని క్రీడా మైదానంగా అభివృద్ధి చేసుకుంటామని వారి దృష్టికి తీసుకువెళ్లగా వెంటనే వారు స్పందించి ఆర్థిక సాయం అందించడం ఆనందంగా ఉందన్నారు. పరిసర గ్రామాలకు చెందిన యువత, క్రీడాకారులకు ఇది ఎంతగానో ఉపయోగకరంగా ఉంటుందన్నారు.